క్లుప్తంగా

నేటి నుంచి ఉరుసు

బద్వేలు అర్బన్ : బద్వేలులోని దర్గా వీధిలో వెలసిన శ్రీహజరత్ హుసేన్‌పీర్ ఔలియా స్వాముల వారి 199వ ఉరుసు మహోత్సవాలు బుధ, గురువారాలలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. హుసేన్‌పీర్ స్వామివారి ఉరుసు ఉత్సవాలు ఈ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచాయి. ఏటా మొహర్రం నెలలో క్రమం తప్పక గత 199 సంవత్సరాలుగా ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బద్వేలులో ఉరుసు ఉత్సవాలు ముగిసిన తర్వాత అదే నెలలో పోరుమామిళ్ళ పట్టణంలో కూడా స్వామి వారి ఉరుసు నిర్వహిస్తారు.

జీవో 117ను రద్దు చేయాలి

కలసపాడు : ప్రభుత్వ విద్యారంగానికి ప్రమాదకారిగా పరిణమించిన జీవో నంబర్ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఇ.బాలజోజి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు బాలఓబయ్య, ప్రభాకర్, ప్రభాకర్ రెడ్డి, కిరణ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

దేవస్థాన స్థలానికి కొలతలు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానం వద్ద మంగళవారం రెవెన్యూ అధికారులు కొలతలు వేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు దేవస్థాన పరిధిలోని స్థలాలను గుర్తించేందుకు మండల తహసీల్దార్ రమకుమారి ఆధ్వర్యంలో సర్వేయర్లు కొలతలు వేశారు. ఆలయ పరిధిలోని వివిధ సముదాయాలు, పలువురు చేసిన ఆక్రమణలలో దేవస్థాన స్థలాన్ని గుర్తించేందుకు కొలతలు వేసి మార్కింగ్ చేశారు. దేవస్థానానికి చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

చెరువుల్లో వరదనీటిని నింపండి

ఖాజీపేట : రాజోలి జలాశయంలో 1200 క్యూసెక్కుల నీరు నిల్వ ఉన్నందున, వెంటనే వరద నీటితో చెరువులను నింపాలని కేసీ కెనాల్ అధికారులకు వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. దుంపలగట్టులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెరువులను నీటిని నింపడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. మోటార్లకు నీరు అందుతుందని అన్నారు. రైతులు ముందస్తుగా నార్లు వేసుకుని వరి సాగుకు సమాయత్తం అవుతారని అన్నారు. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వస్తున్నందున రాజోలి జలాశయానికి నీరు వస్తుందని అన్నారు. సకాలంలో రైతులు పంటలు పండించుకునే అవకాశం ఉందని అన్నారు. కేసీ కెనాల్ కాలువకు తక్షణం నీరు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్, కేసీ కెనాల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఇండ్ల వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వేతన జీవులకు నిరాశ

బద్వేలు అర్బన్ : పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతనజీవులకు ఎలాంటి ఊరట కలగలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదనవి జయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తు మాట బడ్జెట్‌లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ గురయ్య, గోపవరం మండల అధ్యక్షులు క్రిస్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.ఎం.డి.గౌస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు

రాజుపాళెం : టంగుటూరు గ్రామం బీసీ కాలనీలోని వీధుల్లో సీసీ రోడ్డు వేసేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపుతామని పీఆర్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. ఆయన పంచాయతీ కార్యదర్శి బాబు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నవీన్‌తో కలిసి ఆ కాలనీని మంగళవారం పరిశీలించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు బీసీ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని గత సోమవారం కడప కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు వచ్చి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఆదినారాయణ, పుల్లయ్య, రాజా, చిన్నక్క, రామకృష్ణ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మైదుకూరు : రక్తదానం చేయడం వల్ల బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని మైదుకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కరీముల్లా అన్నారు. మంగళవారం నెహ్రూ యువ కేంద్రం, జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రక్తదాన వారోత్సవాల్లో భాగంగా మైదుకూరులోని మేధా డిగ్రీ కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ కరీముల్లా ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ కరీముల్లా, ప్రొద్దుటూరు బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్ రక్తదాతలకు సర్టిఫికెట్, మొక్కను అందజేశారు. కార్యక్రమంలో వాగ్గాడం శివశంకర్, కిన్నెర ప్రసన్నకుమార్, కానాల ఈశ్వరయ్య, ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, దేవిశెట్టి సుబ్రహ్మణ్యం, యడవల్లి హరేరామ్, సుబ్బు, మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రసాద్, సుబ్రహ్మణ్యం, ఆనందరెడ్డి, కమల్ బాషా, కళాశాల ప్రిన్సిపాల్ శెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాగుకు పెట్టుబడి సాయం ఏదీ?

- అన్నదాన సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామని హామీ
- కూటమి ప్రభుత్వం ఏర్పడి 50 రోజులైనా ఊసే లేని సాయం
- గత సర్కారు రైతు భరోసా ద్వారా ఏటా సాయం
- పెట్టుబడి కోసం ఎదురు చేస్తున్న రైతాంగం



సాక్షి, నెట్‌వర్క్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అన్నదాతలకు ఇంత వరకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరు కాలేదు.

అసలు ఎప్పుడు ఈ పథకాన్ని వర్తింపజేస్తారో ప్రభుత్వం ప్రకటించలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేకించి రైతుల కోసం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం ద్వారా ఏటా ప్రతి రైతుకు రూ.13,500 చెల్లించేవారు. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి విడతల వారీగా ఈ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసే పరిస్థితి ఉండేది. దీంతో సీజన్ ఆరంభంలో సేద్యపు ఖర్చులు, విత్తనాలు, ఎరువుల కోసం ఈ మొత్తం ఉపయోగపడేది. ఈ ఏడాది ఇప్పటికే ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో వరి పంట సాగు చేశారు. మిగతా పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైదుకూరు నియోజకవర్గంలో పసుపు, జొన్న, దోస, పత్తి, వివిధ రకాల కూరగాయలు, బద్వేలు నియోజకవర్గంలో జొన్న, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, సజ్జ, పండ్ల తోటలు, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో శనగ, పత్తి, వరి, వేరుశనగ, నువ్వులు, మినుము తదితర పంటలు సాగు చేయనున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని పేరు మార్చి అన్నదాత సుఖీభవగా నామకరణం చేశారు. ఈ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల్లో హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటికే తన వాటాను చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు రైతులకు జమ చేయలేదు. అసలు ఎప్పుడు ఇస్తారు అన్న విషయంపై రైతుల్లో అయోమయం నెలకొంది.

సాగు భూమి వివరాలు		
నియోజకవర్గం	రైతుల సంఖ్య	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
ప్రొద్దుటూరు	20,763	25,400
బద్వేలు	39000	49,500
మైదుకూరు	1,81,826	2,54,039

2019 నుంచి 2024 వరకు వైఎస్సార్ రైతు భరోసా వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
ప్రొద్దుటూరు నియోజకవర్గం		
2019-20	15,807	21.33
2020-21	16,324	22.00
2021-22	16,163	20.99
2022-23	16,209	23.50
2023-24	16,979	9.71
బద్వేలు నియోజకవర్గం		
2019-20	32950	44.48
2020-21	33400	45.09
2021-22	34200	46.17
2022-23	35112	47.40
2023-24	36175	48.83
మైదుకూరు నియోజకవర్గం		
2019-20	33,437	25.79
2020-21	38,162	28.62
2021-22	37,167	27.88
2022-23	37,438	28.08
2023-24	35,622	26.72

రైతులకు సాయాన్ని వెంటనే అందించాలి



రైతులకు ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయాన్ని అందించాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటింది. రైతులు పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. వరుణుడు కనికరించినా.. కేసీ కెనాల్‌కు నీరు విడుదలైన వెంటనే పంటలు సాగు చేస్తారు. సాయం అందకపోతే అప్పులు చేయాల్సి వస్తుంది. ఇప్పటికీ అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ప్రకటన చేయకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

- కాసా పెద్ద ఈశ్వర్‌రెడ్డి, సోమాపురం, రాజుపాళెం మండలం

పేరు మార్చారు అంతే..



టీడీపీ ప్రభుత్వం అన్ని పథకాలకు పేర్లు మార్చింది. అయితే సంక్షేమ పథకాలను మాత్రం ప్రజలకు ఇంకా అందించలేదు. అన్నిటికన్నా ముఖ్యం రైతులకు సాయం అందించడం. రైతుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు, విత్తనాలు అందించాలి. లేకపోతే రైతులు సాగు కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాలి.

- తల్లపురెడ్డి వెంకటరమణారెడ్డి, ప్రొద్దుటూరు

గత ప్రభుత్వంలో సకాలంలో అందేవి



గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా మూడు దఫాలుగా సకాలంలో సాగు కోసం డబ్బులు వచ్చేవి. ఈ ఏడాది జూలై ముగుస్తున్నా ఈ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఇస్తామన్న రూ.20 వేల నగదు ఎప్పుడిస్తారో కూడా ప్రకటించలేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వేయలేదు. మా కుటుంబంలో గతంలో ముగ్గురికి వైఎస్సార్ రైతు భరోసా డబ్బులు సాగు కోసం అందాయి.

-సీవీ సుబ్బారెడ్డి, రైతు, అనంతపురం, చాపాడు మండలం

చంద్రబాబు మాట నిలుపుకోవాలి



రైతులకు పెట్టుబడి సాయాన్ని గత ప్రభుత్వం కంటే పెంచిన చంద్రబాబు, ఆ సాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసి మాట నిలుపుకోవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలకు పెంచి ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికి ఇంకా అందకపోతే ఎలా? పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి.

- వనం గంగిరెడ్డి, రైతు, కేశవాపురం, మైదుకూరు మండలం

హామీ ఇచ్చారు.. అమలు ఎప్పుడో..



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రకారం రైతు భరోసా అందించారు. పంటల సాగుకు ఎంతో ఉపయోగపడింది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మరి ఎప్పుడు అమలు చేస్తారో ఇంకా ప్రకటన చేయలేదు. సకాలంలో ఇస్తే పంటల సాగుకు ఉపయోగ పడుతుంది. లేకపోతే అప్పు చేయాల్సి వస్తోంది. రుణం ఇచ్చే వారు కూడా కరువయ్యారు.

- జవాజి రవి, ఎస్సీ కాలనీ, రెడ్డిపల్లి, అట్లూరు మండలం

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం పెట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక జిన్నా రోడ్డులోని ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ పూజిత, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి డయేరియా లక్షణాలు, ఆ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ జయమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, గోవిందరెడ్డి, పీడీ శ్యామ్యూల్, ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సచివాలయ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్‌ను విద్యాభివృద్ధికి ఉపయోగించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు : విద్యార్థులు మొబైల్‌ను విద్యాభివృద్ధికి ఉపయోగించాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. మంగళవారం స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మొబైల్‌ను పాఠ్యాంశాలు నేర్చుకునేందుకు ఉపయోగించుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు క్రీడలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధి పొందేందుకు విద్యార్థులకు మెలకువలతో కూడిన శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.హుస్సేన్‌రెడ్డి, ట్రాఫిక్‌సీఐ యుగంధర్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవలతో రక్తహీనత నివారణ



ఆరోగ్య సేవల పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : గర్భిణులు, బాలింతలు, యుక్త వయసు బాలికలకు సరైన సమయానికి వైద్య సేవలను అందించడం ద్వారా రక్తహీనత కలగకుండా నివారించవచ్చని డీపీఎంఓ డాక్టర్ శశిభూషన్‌రెడ్డి తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సోములవారిపల్లె, సుబ్బారావు కొట్టాల్లో మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆర్థికపరమైన అంశాలను గర్భిణులకు వివరించాలని చెప్పారు. అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో ఒకే ఆర్డర్‌లో పొందుపరచాలన్నారు. పీపీఎం నారాయణ, డీపీఎస్ఓ అరుణ, ఏఎస్ఓ హరిలు గర్భిణులు, బాలింతలు, కౌమార బాలిక వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, సీహెచ్ఓ శిరీష, గౌతమి, గంగా తులసి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



ప్రొద్దుటూరులో మద్యం సీసాలు, వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది, పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని జనావాసాలు కలిగిన ఖాళీ ప్రాంతాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. రామేశ్వరం రోడ్డులోని బుశెట్టి కల్యాణ మండపం సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మద్యం సీసాలు, ఇతర వ్యర్థ పదార్థాలను మంగళవారం వన్‌టౌన్ పోలీసు, మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

పోరుమామిళ్ల : పట్టణ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి పారేసిన మందు సీసాలు, ఖాళీ నీళ్ల బాటిళ్లు, ఖాళీ నీళ్ల ప్యాకెట్లను పారిశుద్ధ్య కార్మికుల సహకారంతో పోలీసులు ఎత్తి వేయించారు. మద్యం బాబులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. వారిలో మార్పు రాకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అట్లూరు : మండలంలోని బద్వేలు – కడప ప్రధాన రహదారిపై బహిరంగ ప్రదేశాల్లో పోలీసులు ప్రజలతో కలిసి కంపచెట్లు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.సి.రాజు మాట్లాడుతూ మందుబాబులు మద్యం తాగి బాటిళ్లను ఖాళీ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా పడేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఉపాధి పనుల అక్రమాలపై విచారణ



ఉపాధి పనుల పై అడిషనల్ పీడీ నాగరత్నమ్మకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఖాజీపేట : పేద కూలీలకు పని చూపించాల్సిన ఉపాధి హామీ పథకంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడటంపై అడిషనల్ పీడీ నాగరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతామని ఆమె పేర్కొన్నారు. ఖాజీపేట మండలంలో 2023-24లో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ జరిగింది. దీనిపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి, అవకతవకలను సోషల్ ఆడిట్ సిబ్బంది బహిర్గతం చేశారు. రూ 1,19,187 మొత్తంను అధికారులు రికవరీ చేశారు.

సమగ్ర విచారణ జరుపుతాం

ఖాజీపేట ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు తన మైనర్ పిల్లలు హేమంత్ కుమార్, సియిశ్రీ తోపాటు భార్య సుగుణ ఉపాధి పనులకు వెళ్లినట్లు రికార్డు నమోదు చేసి నిధులు స్వాహా చేశారని తేల్చారు. అయితే సుగుణ మోడల్ స్కూల్‌లో ఉద్యోగిగా ఉంటూ ఎలా ఉపాధి పనులు చేశారని ఖాజీపేట ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి నిలదీశారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ ఓబులేసు నుంచి రూ.78,900 రికవరీ చేశారు. అయితే జాబ్ కార్డు 2021లో ఇచ్చారని, అప్పటి నుంచి స్వాహా చేశారని, అధికారులు ఈ విషయాల పై విచారణ జరపలేదని అడిషనల్ పీడీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మోడల్ స్కూల్‌లో దాసరి శిరోమణి ఆయాగా, పాలూరు సుజాత హెడ్‌కుక్‌గా పని చేస్తున్నారు. వారు ఉపాధి పనులు చేసినట్లు రికార్డులో ఉంది. అదే సమయంలో మోడల్ స్కూల్‌లో పని చేసినట్లు ఉండటం ఎలా సాధ్యం అని నిలదీశారు. మరికొందరు పనులకు వెళ్లక పోయినా పోయినట్లు రికార్డులు సృష్టించి, ఉపాధి సొమ్మును స్వాహా చేసిన విషయం ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన అడిషనల్ పీడీ సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రికార్డులు ఇంటిలో పెట్టుకుని ఏం చేస్తారు?

బి.కొత్తపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ జాబ్‌కార్డులు చూపించలేదని సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. అలాగే గ్రామంలో పనులు సక్రమంగా చూపించడం లేదని ఫిర్యాదు చేశారు. బినామీలను పెట్టుకుని స్వాహా చేస్తున్నాడని అడిషనల్ పీడీకి కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలిస్తామని అడిషనల్ పీడీ తెలిపారు. త్రిపురవరం ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో ఎవరికీ పనులు సక్రమంగా చూపించడం లేదని గ్రామసభలో ఫిర్యాదులు చేసిన అర్జీలను అడిషనల్ పీడీకి ఇచ్చారు. అలాగే పుల్లూరు, తుడుమలదిన్నె, చెన్నముక్కపల్లె, చెమ్ముళ్ళపల్లె, భూమాయపల్లె ఫీల్డ్ అసిస్టెంట్స్ జాబ్‌కార్డుల్లో సంతకాలు, రికార్డు నమోదు విషయంలో జరిగిన తప్పిదాలపై అడిషనల్ పీడీ నాగరత్నమ్మ తీవ్రంగా మందలించారు. ఉపాధి హామీలో పని చేస్తున్న సిబ్బంది జాగ్రత్తగా పని చేయాలని ఆమె హెచ్చరించారు.

ఘనంగా బాలగంగాధర్‌తిలక్ జయంతి

కాశినాయన : ఆకులనారాయణపల్లె ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధులు లోకమాన్య బాలగంగాధర్‌తిలక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలి

అట్లూరు : రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎం.నాగరాజ పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో బద్వేలు డివిజన్ పరిధిలోని గోపవరం, బద్వేలు మండలాల్లోని ఎరువులు, విత్తనాలు, పురుగు నివారణ మందుల డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లైసెన్సు గడువు, స్టాకు రిజిస్టర్ నిల్వలు, గోడౌన్స్ నిల్వలు, రసీదు బుక్స్‌లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సమావేశంలో ల్యాబ్ వ్యవసాయాధికారిని బి.మాధురి, కార్యాలయ సిబ్బంది గైబువల్లి, చంద్రకళ, డీలర్లు పాల్గొన్నారు.

జెడ్పీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌కు సన్మానం

చాపాడు : జిల్లా పరిషత్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ జేష్టాది శారదను మంగళవారం పలువురు జెడ్పీటీసీలు కలిశారు. ఇటీవల ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన శారదను పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, చాపాడు జెడ్పీటీసీ రాజీ భర్త శాంతరాజు, ఇంకా పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.

ఎన్నికల పారితోషికం ఇవ్వండి

ప్రొద్దుటూరు : ఎన్నికల్లో పని చేసిన ఉద్యోగులకు పారితోషికం చెల్లించాలని ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి జె.రామసుబ్బయ్య ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ముగిసి చాలా రోజులైనా ఇంత వరకు సచివాలయ ఉద్యోగులకు పారితోషికం చెల్లించలేదన్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ సమాధానం ఇస్తూ ఈ విషయమై కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శివరామానుజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభంజనరెడ్డి, జాయింట్ సెక్రటరీ నాగార్జున, ఈసీ మెంబర్ ప్రభాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ సీట్లు ఇవ్వాలి

రాజుపాళెం : అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులందరికీ సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశాడు. వెల్లాలలోని బాలికల గురుకుల పాఠశాల వద్ద మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి జగన్ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వివరాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా సీట్లు పెంచాలని తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి, విద్యార్థులకు సరిపడ గదులను కేటాయించాలన్నారు. విద్యార్థులను ఎంట్రెన్స్ ఎగ్జామ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీంతో అసలైన పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. గురుకుల పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో, అందులో ఖాళీలు ఏ తరగతిలో ఎన్ని ఉన్నాయో పాఠశాలల్లో డిస్‌ప్లే రూపంలో తెలియజేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు సీట్లు కావాలని అడిగితే సీట్లు లేవని, ఖాళీ సీట్లను రాజకీయాలు చేస్తూ అధికారులు మోసం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పవన్, రాజేష్ పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన పెంపొందించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

బద్వేలు అర్బన్ : పని ప్రదేశంలో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధానికి 2013లో అమల్లోకి వచ్చిన పీఓఎస్‌హెచ్ (పోష్) (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్ ఎట్ ద వర్క్ ప్లేస్) చట్టంపై మహిళలకు అవగాహన పెంపొందించాలని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పీడీ డి.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో ఆర్డీఓ చంద్రమోహన్, డీఎస్పీ వెంకటేశులతో కలిసి వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గ స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు పోష్ యాక్ట్ కింద నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదు స్వీకరించడానికి ప్రతి శాఖలో, ప్రతి కంపెనీలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ చట్టం ద్వారా ఫిర్యాదు చేయడం ద్వారా బాధిత మహిళ లేదా ప్రతివాదిని వేరే ప్రదేశానికి బదిలీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రమోహన్, డీఎస్పీ వెంకటేశు, సీడీపీఓలు శ్రీదేవి, లక్ష్మిదేవి, ఎస్.శ్రీదేవి, డీఎల్‌డీఓ రజనీకాంత్, అర్బన్ సీఐ యుగంధర్, నియోజకవర్గంలోని ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పీడీ కార్యాలయ సిబ్బంది అశ్విని, సునీత, ఉమాదేవి పాల్గొన్నారు.

దువ్వూరు : మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టాలంటే పోష్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని చాపాడు ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ తెలిపారు. ఎంపీడీఓ సభాభవనంలో విద్యాశాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో ఈ చట్టంపై ప్రత్యేక అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, ఎంఈఓ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ అలీఖాన్, వీఆర్ఓలు పాల్గొన్నారు.